ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 • కనిష్ఠం 5.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శుక్రవారం 28 నవంబరు 2025



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

» కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ రాజర్షిషా వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ బూత్‌లు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ వరకు ప్రతీ అంశం మండలవారీగా సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు శాఖతో సమన్వయం పెంచి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామ పంచాయతీలకు సంబంధించిన మొదటి విడత ఎన్నికల కోసం 1408 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 20 శాతం రిజర్వులతో కలిపి మొత్తం 1478మంది పీఓలు, 1729 మంది ఏపీఓలను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీవో రమేష్, డీపీఆర్వో విష్ణువర్ధన్ ఉన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్టర్‌లు

సోయా కొనుగోలు కేంద్రం పరిశీలన

జైనథ్,నవంబరు27 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో కొనుగోలు చేస్తున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని గురువారం సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.శివకుమార్, వి.స్వప్న పరిశీలించారు. వీరు ఇటీవల గ్రూప్ పరీక్షలలో ఉత్తీర్ణులై ఆదిలాబాద్ జిల్లా సహకార సంఘంలో అసిస్టెంట్ రిజిస్టర్‌లుగా బాధ్యతలు చేపట్టారు. శిక్షణలో భాగంగా జైనథ్‌లో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న సోయా కేంద్రాన్ని వారు పరిశీలించి పలు అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైనథ్ సహకార సంఘం సీఈఓ జి.గంగన్న, కార్యదర్శి సుశీల్‌కుమార్‌లతో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీకి సరే.. పైసలెట్లా?



సర్పంచ్ పదవి కోసం పోటాపోటీ

» ఎన్నికల ఖర్చుల కోసం అప్పుల వేటలో అభ్యర్థులు

» అర ఎకరం అమ్మినా తగ్గేదే లేదంటున్న ఆశావహులు

» గ్రామాల్లో మొదలైన బుజ్జగింపు రాజకీయాలు

» ఖరీదైన ఎన్నికలతో అభ్యర్థుల ఆందోళన

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఖరారవడంతో బరిలో దిగేందుకు పలువురు ఆశావహ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో మంచి పలుకుబడి, పేరు ప్రతిష్ఠలు, కుటుంబ సామాజిక బలమున్న నేతలను అభ్యర్థులుగా నిలిపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే పోటీకి సరే.. అంటున్న పైసలెట్లా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం కావడంతో పల్లె రాజకీయాలు ఊపందుకుంటున్నాయి.

ఆదిలాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్ పదవుల కోసం పోటాపోటీ సాగుతోంది. ఎన్నికల్లో గెలిచేందుకు ఓటర్ల మద్దతును కూడగడుతున్నారు. అలాగే దీటైనా అభ్యర్థుల నుంచి పోటీ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. చాలా గ్రామాల్లో సర్పంచ్ పదవుల కోసం నువ్వా.. నేనా అన్నట్లుగా ఓటీ కనిపిస్తోంది. జిల్లాలో మొదటి విడత కింద ఆరు మండలాల పరిలో 166 సర్పంచ్ స్థానాలు, 1390 వార్డుస్థానాలకు ఎన్నిలు నిర్వహించేందుకు అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేస్తుండగా మరికొన్ని గ్రామాల్లో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్న పైసలు లేవన్న కారణంగానే వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

పైసలు ఉంటేనే రాజకీయం

పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు భారీగా అంచనాలు వేసుకుంటున్నారు. ఖరీదైన ఎన్నికలతో ఖర్చు భారం పెరిగిపోతుందని ఆందోళనకు గురవుతున్నారు. పైసలు ఉంటేనే రాజకీయం చేయాలంటూ ఓటర్లు బహిరంగంగానే పేర్కొంటున్నారు. చిన్న గ్రామ పంచాయతీలు 5లక్షల వరకు మేజర్ గ్రామ పంచాయతీలైతే 10లక్షలకుపైగా ఖర్చయ్యే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల ఖర్చుల కోసం ముందే డబ్బులను సర్దుబాటు చేసుకుంటున్నారు. అవసరమైన పైసల కోసం అప్పులు చేసేందుకైనా సిద్ధమవుతున్నారు. స్నేహితులు, బంధుమిత్రులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అప్పు పుట్టని వారు బంగారు నగలను తాకట్టు పెడుతూ ఎన్నికల ఖర్చుల కోసం డబ్బులను సమకూర్చుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పంటలు చేతికి రావడంతో అప్పులు ఇచ్చేందుకు కొంతమంది రైతులు ముందుకు వస్తున్నారు.



అభ్యర్థులకు ఆఫర్లు

ఎన్నికల బరి నుంచి తప్పుకుంటే అడిగినంతా ఇస్తామంటూ అభ్యర్థులకు ఆఫర్ చేస్తూ ఎరవేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ముట్టచెప్పి ప్రత్యర్థులను సైలెంట్ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులే ఎన్నికల బరిలో నిలుస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. సన్నిహితులతో అభ్యర్థులను పోటీనుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చెప్పింది వినకుంటే కొన్ని సందర్భాల్లో బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు వినిపిస్తోంది. పలుకుబడి, పరపతితోపాటు డబ్బు ప్రభావం కూడా అధికంగానే కనిపిస్తుంది. సర్పంచ్‌గా గెలిస్తే గ్రామంలో అభివృద్ధి పనులు చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్నా మరికొందరు నగదు బంగారాన్ని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

గెలిచినా.. ఓడినా పోటీకి సై

ఎన్నికల్లో గెలిచినాఓడినా (మిగతా 6లో..)



భీంపూర్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నిఖిల్‌రాజ్

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

భీంపూర్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఆకస్మికంగా గుండెపోటు వచ్చిన వారికి పరిసరాలలో ఉన్నవారు వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడొచ్చని భీంపూర్ సీపీఆర్ వైద్యాధికారి నిఖిలరాజ్ అన్నారు. గురువారం భీంపూర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది యువతకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నిర్మాణాత్మకంగా సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. సీపీఆర్ చేసిన వెంటనే అంబులెన్స్ ద్వారా లేదా సమీప ఆసుపత్రులలో చికిత్స కోసం తరలించాలని అన్నారు. వైద్య సిబ్బందే కాకుండా అన్నిశాఖల వారు, యువకులు ఈ విషయంలో అవగాహన పెంపొందించుకుంటే ఎంతోమంది ప్రాణాలు కాపాడినవారు అవుతారన్నారు. ప్రతీ గ్రామంలో సీపీఆర్‌పై అందరికి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గంగారెడ్డి, వైద్యాధికారి జ్ఞానేశ్వర్, సిబ్బంది మేఘ, రోహిదాస్, సంధ్యారాణి, సాహితీ, తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఎన్నికల్లో సత్తా చాటాలి

» డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం ప్రజా సేవాభవన్‌లో ఆదిలాబాద్ రూరల్, మావల, సాత్నాల మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే ఎన్నికలు పునాది వంటివని, ఇక్కడ బలంగా తయారై ఎన్నికల్లో విజయం సాధిస్తే అదే ఊపుతో మిగతా ఎన్నికల్లో కూడా సత్తా చాటేందుకు దోహదపడతాయన్నారు. పంచాయతీలలో పార్టీ మద్దతుతో ఎవరు పోటీ చేసినా గ్రామంలోని మిగతా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపుకోసం పని చేయాలని అన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడు మండలాల్లోని ఆయా గ్రామపంచాయతీలలో ససర్పంచ్, వార్డుమెంబర్లకు పోటీపడే అభ్యర్థులకు నామినేషన్ విషయంలో తగు దిశానిర్దేశం చేశారు. ఆశావహులు గ్రామాల వారీగా తమ పేర్లు యాల్లోయంలో నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, కొండ గంగాధర్, లోక ప్రవీణ్‌రెడ్డి, గుడిపల్లి నగేష్, శ్రీలేఖ తదితరులు ఉన్నారు.

'బీసీలపై బీఆర్ఎస్ కపట ప్రేమ'

తలమడుగు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): బీసీలపై బీఆర్ఎస్ పార్టీ కపట ప్రేమ చూపుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల అధికారం ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోలేదని అన్నారు. బీసీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాస్ ఎంపీటీసీ వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు చరణ్‌తేజ్

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కొమ్ము చరణ్‌తేజ్ అండర్-17 స్విమ్మింగ్ విభాగంలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 5 వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పోటీలు జరనున్నాయి. తెలంగాణ నుంచి చరణ్‌తేజ్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఆయనకు అధికారులు, క్రీడాభిమానులు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం ఎన్నికల కమిషన్ పంచాయతీ ఎన్నికల తేదీలు ప్రకటించడంతో కోడ్ అమల్లోకొచ్చింది. దీంతో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నాయకుల ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు.

అంగన్‌వాడీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలు ఇటీవల జరిగిన నేపథ్యంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాడిగా కె.సునీత, ప్రధాన కార్యదర్శిగా పి.జయలక్ష్మి, కోశాధికారిగా పి.మంగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎం.పద్మశ్రీలతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని యూనియన్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆశ్రమ పాఠశాలలో రక్త నమూనాల సేకరణ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లఖంపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల వసతి గృహంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో విద్యార్థుల కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) కోసం రక్త నమూనాలను సేకరించారు. ఇందులో హెల్త్ సూపర్‌వైజర్ ఏ.సంతోష్, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న ఉన్నారు.

'కాంగ్రెస్ బీసీలను మోసం చేసింది'

బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో గతంలో 473 గ్రామ పంచాయతీలలో 86 గ్రామ పంచాయతీలు బీసీలకు కేటాయించడంతో రాజకీయంగా బీసీ వర్గాల నాయకులు ఎదిగారని అన్నారు. అయితే ఇప్పుడు కేవలం 24 గ్రామ పంచాయతీలు బీసీలకు రిజర్వ్ కావడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా ఎదగనివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. బోథ్ నియోజకవర్గంలో 238 గ్రామ పంచాయతీ ఉండగా కేవలం 11 మాత్రమే బీసీలకు రిజర్వు అయ్యాయని అన్నారు. దీంతో బీసీలను రాజకీయ పరంగా అనగదొక్కడం కాదా అని ప్రశ్నించారు. బీసీలంతా ఐక్యమై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తే అందులో 51.7శాతం బీసీ జనాభా ఉన్నట్లు గుర్తిస్తే ప్రస్తుతం ఈ ప్రభుత్వం 46శాతం బీసీలు ఉన్నట్లు పేర్కొందని అన్నారు. విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు బి.శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ

యువత బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి

నార్నూర్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): నేటి యువత తమ హక్కులను కాపాడుకోవాలంటే పోరాట యోధుడు బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్ అన్నారు. గురువారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్రస్థాయి సమావేశానికి ఆదిలాబాద్ జిల్లా నుంచి హాజరై మాట్లాడారు. బిర్సా ముండా తాను చదువుకునే రోజుల్లోనే ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమాన్ని నడిపి వారికి ఆరాధ్యదైవంగా మారాడన్నారు. మావ నాటే మావ రాజ్ కావాలని, మావా ఉద్యోగం మాకే కావాలనే నినాదంతో అందరూ ఐక్యమై రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెందుర్ సంతోష్

నేటి నుంచి అఖండ దత్తనామ సప్తాహ

బజార్‌హత్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దత్త జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని దత్త మందిరంలో నేటి నుంచి అఖండ దత్తనామ సప్తహను నిర్వహిస్తున్నట్లు ఉత్తంగిరి మహారాజ్ గురువారం తెలిపారు. కాగా ఈనెల 28 నుంచి డిసెంబరు 4 వరకు ఈ భవ్య సప్తహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రవచనాలు, నిత్యాన్నదానంతోపాటు దత్తనామ భజన, గురు చరిత పారాయణ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. చివరిరోజు దత్త పల్లకి నగర శోభాయాత్రతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పాఠశాల గేటును విరగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

భీంపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి ఉన్నత పాఠశాల గేట్‌ను ఎవరో విరగొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం అశోక్‌రెడ్డి భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆకతాయిలు బుధవారం రాత్రి గేటును విరగొట్టారని పేర్కొన్నారు. పాఠశాలలో ప్రవేశించి మద్యం తాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



విరగొట్టిన గేట్ ఇదే..

ఎన్నికల నియమావళిని పాటించాలి

» ఎన్నికల బందోబస్తుకు పోలీసు శాఖ సిద్ధం

» సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు

» రూ.50వేలకు మించి నగదు తరలించొద్దు

» తరలిస్తే రశీదు చూపించాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పాల్గొన్న పోలీసు అధికారులు

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని అందరూ అనుసరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలీస్‌శాఖ సంసిద్ధంగా ఉందని చెప్పారు. గురువారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రభావితం చేసే, ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎన్నికల రోజు ప్రత్యేకంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా ఎలాంటి సమాచార వ్యవస్థ సాధ్యం గానీ, ప్రదేశాలలో షాడో జోనల్‌లలో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా వీహెచ్‌ఎఫ్ సెట్లను వినియోగించాలని సూచించారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. అత్యధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో బైక్ పెట్రోలింగ్ ద్వారా గస్తీ నిర్వహించాలన్నారు. 50వేల కంటే ఎక్కువగా నగదు తరలించే సమయంలో సరైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణ జరిగేలా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నెలవారీ సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కాజల్ సింగ్, బి.సురేందర్‌రావు, ఏఎస్పీ పి.మౌనిక, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, జిల్లా సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, కమ్యూనికేషన్, డీసీఆర్బీ, ఎస్‌బీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. కేంద్రం తీసుకువచ్చిన లేబర్‌కోడ్ గెజిట్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ, టీయూసీఐ, బీఆర్టీయూ సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్.విలాస్ మాట్లాడుతూ కార్మికులు ప్రాణత్యాగాలు చేసి 29 చట్టాలు సాధించుకున్నారని తెలిపారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తలొగ్గి కార్మికులకు అన్యాయం చేసేలా బానిసత్వంలో నెట్టేలా నాలుగు కోడ్లను తీసుకువచ్చిందన్నారు. కోడ్ల కారణంగా కార్మికులు సాధించిన హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కోడ్లను రద్దు చేసేంత వరకు కార్మిక సంఘాలు ఉద్యమాలు కొనసాగిస్తాయని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దేవేందర్, జగన్ సింగ్, అశోక్, ఖాసీమ్, గణేష్ పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర వసతి గృహంలో ఏటీడీవో విచారణ

బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో గురువారం ఏటీడీవో సుచన్‌తన్‌రెడ్డి విచారణ చేపట్టారు. అన్నంలో పురుగులు వస్తున్నాయనే విద్యార్థుల ఫిర్యాదు చేయడంపై ఆయన స్పందించి హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని వార్డెన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వార్డెన్‌ను తొలగించాలని కొంతమంది విద్యార్థులు అధికారికి తమ ఇబ్బందులను వివరించారు. అయితే మరి కొంతమంది విద్యార్థులు హాస్టల్‌లో తమకు ఎలాంటి ఇబ్బందులు లేదని చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏటీడీవో వెల్లడించారు. హాస్టల్లో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని చెప్పడంతోనే విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారని వార్డెన్ నామ్‌దేవ్ పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎంపీవో

తలమడుగు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని ఎంపీఈవో వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలో మూడో విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. 28 మండలంలో 29 గ్రామపంచాయతీలు 250 వార్డులకు ఎన్నికలు ఏర్పాట్లు చేశామన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు క్లస్టర్ వారీగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా తమ కులధృవీకరణ పత్రాలు ఇంటి పన్ను రశీదు ఎన్నికల అధికారి జారీచేసిన నిబంధనలు పాటించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల పత్రాలను నామినేషన్ పత్రాలను పరిశీలించి క్లస్టర్ల వారీగా వేరు చేశారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ రాజకుమార్ కొత్తూరు పంచాయతీ సెక్రెటరీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌కు ఆదిలాబాద్ డిపో బస్సులు నడపాలి

బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ డిపో నుంచి బోథ్ కు నడిపే బస్సులను యధావిధిగా నడపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బస్సులు రద్దు కావడంతో ఇబ్బందులు వస్తున్నాయని, అద్దెబస్సులు సైతం లేక ఆదిలాబాద్ డిపో బస్సులను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్డినరీ బస్సులను నిర్మల్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులుగా మార్చి నడుపుతున్నారు. నిర్మల్, భైంసా, నిజామాబాద్ డిపోలకు చెందిన బస్సులు భారీగానే నడుపుతున్నారు. ఆదిలాబాద్ డిపో ఆర్డినరీ బస్సులను నిర్మల్‌కు పంపాల్సిన అవసరం ఏముందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆదిలాబాద్ డిపో టు ధన్నూర్‌కు వస్తున్న బస్సు నడపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రెండు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఏకగ్రీవం

ఇంద్రవెల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఏకగ్రీవంపై దృష్టిసారిస్తున్నారు. మండలంలోని మెండపల్లి, వాల్గొండ గ్రామ పంచాయతీ ప్రజలు గురవారం ఏకగ్రీవంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లను ఎన్నుకోవాలని నిర్ణయించారు. మెండపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కొండప శ్రీరాం, ఉపసర్పంచ్‌గా ముండే మోహన్, అదేవాల్గొండ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కినక సునీత, జుగాదిరావు, ఉప సర్పంచ్ జుగ్నాక నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఏకగ్రీవంగా ఆయా గ్రామస్థులు నిర్ణయించిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకోబడ్డ గ్రామ పంచాయతీలకు అభివృద్ధిలో మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. అదనంగా తన తరఫున రూ.25 లక్షలతో అభివృద్ధి పనులుచేయడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముఖడే ఉత్తం, ఆయా గ్రామాల ప్రజలు కినక లచ్చు పటేల్, మెస్రం సోమేశ్వర్, తదితరులు ఉన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

సిరికొండలో ఐదు జీపీలు ఏకగ్రీవం

సిరికొండ: మండలంలోని రాయిగూడ, కుంటగూడ, కన్నాపూర్, రిమ్మ, నారాయణ్ పూర్ గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డుసభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పటేల్, మాజీ సర్పంచ్‌లు, పెద్దల సమక్షంలో ఆయాగ్రామాల్లో సమావేశమై రాయిగూడకు పెందూర్ లక్ష్మణ్‌ను సర్పంచ్‌గా, కుంటగూడకి కుమ్రం మీరాబాయి, రిమ్మ పెందూర్ జంగుబాయి, కన్నాపూర్‌కి సిడాం బాలదేవి, నారాయణపూర్‌కి చిక్రం రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌లు, మాజీ సర్పంచ్‌లు మడావి గంగారాం, పంద్రం హనుమంత్, సిడాం మధన్, పంద్రం శ్రీకాంత్, పెందూర్ జంగుబాపు, వీటీడీప సిడాం అమృత్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

» రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరింఆచలని రాజకీయ పార్టీల నేతలను కలెక్టర్ రాజర్షిషా కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షాసమావేశంలో నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలపై రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగుతుందని, ప్రజాస్వామ్య పండుగలా జరిగే ఎన్నికలను విజయవంతం చేయడం అందరి బాధ్యతగా కలెక్టర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలు మూడుదశల్లో 20 మండలాల్లో జరగనున్నాయని తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనపై చర్యలుంటాయని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం పంపిణీ, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా వ్యవస్థ బలోపేతం, గ్రామస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీచేశామన్నారు. సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, రాజేశ్వర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికా రి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోనిచబ్రా, ఆర్డీఓ స్రవంతి, తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.వెంకన్న, వ్యయ పరిశీలకులు ఎల్.విజయ గురువారం కలెక్టర్ రాజర్షిషాను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది శిక్షణ, ఓటర్ల సౌకర్యాలు, నిబంధనల అమలు, వెబ్‌కాస్టింగ్, వ్యయ పరిమితులపై పరిశీలకులు కలెక్టర్‌తో చర్చించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను వారు సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డీవైఎస్ఓ శ్రీనివాస్, డీఎల్‌పీఓ ఫణిందర్ పాల్గొన్నారు.

గోండుగూడలో మౌలిక వసతులు కల్పిస్తా : ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇజ్జాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూల గోండుగూడ గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం ఆయన గోండుగూడను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ మారుమూల గోండుగూడ గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తానని హామీఇచ్చారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచుతూ, గోండుగూడలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వారికి రాజ్యం కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు రవీందర్‌రెడ్డి, రమేష్, అనిల్ యాదవ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పోటీకి సరే.. పైసలెట్లా?

(5వ పేజీ తరువాయి...)

ఫర్వాలేదు కానీ పోటీకి మాత్రం సై అంటున్నారు. గెలిస్తే ఒకే.. ఓడిపోతే అర ఎకరం అమ్మి అయినా అప్పులు తీర్చుతామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎలాంటి స్థిరాస్థులులేని అభ్యర్థులు మాత్రం ఆచితూచి అడుగులువేస్తున్నారు. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుతో ఉన్నట్లు కనపిస్తోంది. జనరల్, బీసీ స్థానాల్లో పోటీ తీవ్రంగానే కనిపిస్తున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్స్ స్థానాల్లో మాత్రం పోటీ నామమాత్రంగానే ఉంటుంది. తీవ్రమైన పోటీ ఉన్న తగ్గేదే లేదంటూ సవాల్ విసురుతున్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి మరి ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యార్థులను చిత్తుగా ఓడించేందుకు టార్గెట్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా పంచాయతీ ఎన్నికల గురించే చర్చిస్తుండడం కనిపిస్తోంది.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు

బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు అయినట్లు ఏఈ సునిల్ తెలిపారు. గురువారం వసతి గృహంలో మరమ్మతులు చేసి న మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి గత 10 రోజులకు క్రితం రూ. 5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. మరమ్మతులకు సంబంధించిన రూ.లక్షా 25వేల నిధులు ఇంకా మంజూరు కాలేదని, ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారులకు విన్నవిస్తామన్నారు.


హాస్టల్‌లోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఏఈ

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాత్నాల మండలం మేడిగూడ (ఆర్) గ్రామం నుంచి గంగపుత్ర సంఘ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తుమ్మని అశోక్‌కు సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో కలాల శ్రీనివాస్, శాంతన్‌రావు, ఇమ్రాన్, రాంకుమార్, రవీందర్‌రెడ్డి, భూమన్న, వసంత్‌రావు, శ్యాం సుందర్, రామన్న, దినేష్, ఖయ్యుం పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

ఇచ్చోడ, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.వెంకన్న పరిశీలించారు. ఇచ్చోడ క్లస్టర్ పరిధిలోని ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్, ఎంపీఓ అతుల్, ఈఓ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'సీనియర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

ఉట్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉపాధ్యాయవృత్తిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రవి కుమార్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల అర్హత పరీక్ష పెట్టకముందే ముందే డీఎస్సీలో ఉద్యోగం సాధించిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ మేరకు సంఘ తీర్మానం కాపీని గురువారం విద్యామంత్రి ముఖ్యమంత్రికి ఫ్యాక్స్ ద్వారా సీఎంఓ కార్యాలయానికి కాపీ పంపినట్లు ఈ సమావేశంలో తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు జాదవ్‌అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు శీతల్‌చౌహాన్, ఉట్నూర్ మండల బాధ్యులు దినేష్‌కుమార్, కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి


దౌనెల్లి తండాలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుంటాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం కుంటాల మండలంలోని దౌనెల్లి తండా సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలను తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామస్థులకు స్థానిక ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో గ్రామస్థులందరూ ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుంటాల పోలీసులు, తదితరులు ఉన్నారు.

బోటు సర్వీసుల పునరుద్ధరణపై చర్చలు


గంగపుత్రులతో చర్చలు జరుపుతున్న అధికారులు

బాసర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి నదిలో నిలిపివేయబడిన బోటు సర్వీసులను తిరిగి ప్రారంభించే అంశంపై బాసర జ్ఞాన సరస్వతీ దేవస్థానం కార్యాలయంలో గురువారం ఉన్నతాధికారుల సమక్షంలో సమావేశం జరిగింది. బోటు సర్వీసులను నడిపేందుకు అనుమతి ఇవ్వాలని గంగాపుత్ర సంఘం వారు అనేక పర్యాయములు విన్నవించుకున్న నేపథ్యంలో ఫిషరీస్ శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖ నీటి పారుదల శాఖ అధికారుల సమక్షంలో గంగాపుత్ర సంఘం నాయకులతో ఈ సమావేశం జరిగినట్లు దేవస్థానం వర్గాల వెల్లడించాయి. ఈ బోటు సర్వీసుల పునరుద్ధరణకు గల సాధ్యాసాధ్యాలు, భద్రతా ప్రమాణాలు, నిబంధనలపై అధికారులు ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల ఫలితంగా బోటు సర్వీసులు పునరుద్ధరణకు త్వరలో తగిన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని గంగాపుత్ర సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీలను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

» బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్ట సభల్లో 42 శాతం వాటా కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించి నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కేవలం 17 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించి నట్టెట్ట ముంచిందని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. గురువారం సంబంధిత విషయంలో ప్రకటన విడుదల చేశారు. తడిగుడ్డతో గొంతుకోసే విధానాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీలు 51 శాతం మంది ఉన్నారని తేల్చారన్నారు. అయితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పేరిట బీసీ వర్గాల సంఖ్యను 46 శాతానికి తగ్గించిందని వివరించారు. రోటేషన్ పేరిట స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సర్పంచ్ స్థానాలు తగ్గించి ఘోరంగా మోసగించిందని దుయ్యబట్టారు. 2019 స్థానిక ఎన్నికల్లో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు ఇచ్చారని ప్రస్తుతం 17 శాతం మాత్రమే అమలు చేయడం వల్ల బీసీ వర్గాల వారు రాజకీయ అవకాశాలు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. బీసీ వర్గాలను అన్నివిధాలుగా అణగదొక్కే రీతిలో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలహీన వర్గాల వారంతా ఐక్యమై తగు రీతిలో గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు.

నీటి వనరుల గణనపై శిక్షణ విజయవంతం

» రైతు వేదికలో అధికారులు మార్గదర్శనం

నర్సాపూర్(జి), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) మండలం లోని రైతు వేదికలో 7వ ఎంఐసీ, 2వ నీటి వనరుల గణన శిక్షణ కార్యక్రమం గురువారం ఉత్సాహంగా జరిగింది.


నర్సాపూర్(జి)లోని రైతు వేదికలో శిక్షణ తరగతులు దృశ్యం

ఉన్నతాధికారుల మార్గదర్శనం

ఈ కీలకమైన శిక్షణ సదస్సులో పలువురు ఉన్నతాధికారులు పాల్గొని, సిబ్బందికి విలువైన మార్గనిర్దేశం చేశారు. హాజరైన వారిలో తహసీల్దార్ శ్రీకాంత్, సీపీవో జీవరత్నం, డీవైఎస్‌వో ప్రశాంత్, ఎంపీఎస్‌వో శ్రీరామ్, ఎంపీవో తిరు పతి రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ... నీరు అనేది మన జీవితంలో అత్యంత విలువైన వనరు. ఈ గణన ద్వారా మండలంలో ఉన్న చి న్న, పెద్ద నీటి వనరులను, చెరువులను, కుంట లను కచ్చితంగా గుర్తించగలుగుతాం. వాటి ప్రస్తుత స్థితి, ఆక్రమణలు ఏమైనా ఉంటే తెలుసుకుని వాటిని పరిరక్షించడానికి, పునరుద్ధరించడానికి ఈ సమాచారం కీలకంగా ఉపయోగపడుతుంది. ప్రతిఒక్కరూ ఈ సెన్సస్‌ను బాధ్యతగా పూర్తి చేసి, భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించాలని నొక్కి చెప్పారు.

కార్యదర్శుల భాగస్వామ్యం..

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు చురుగ్గా పా ల్గొన్నారు. శైలజ, నవనీత్, నరేష్, సంధ్యారాణి, సంస్కృతి తదితరులతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు శిక్షణలో పాల్గొని, సెన్సస్ నిర్వహణ విధి విధానాలను పూర్తిగా తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రాంతంలోని నీటి వనరుల స్థితి, సంఖ్యను ఖచ్చితంగా అంచనా వేయడానికి ఈ సెన్సస్ చాలా కీలకం. భవిష్యత్తులో సమర్థవంతమైన నీటి నిర్వహణ ప్రణాళికలకు ఈ డేటా ఆధారమవుతుందని తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది త్వరలోనే గణన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

1న గ్రంథాలయ ప్రారంభోత్సవం

డిసెంబరు 1, 2025న నర్సాపూర్‌లోని రామాలయం వద్ద నూతన గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ విద్యా సంబంధ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఓటరు లిస్టును పరిశీలించిన నాయకులు

లోకేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా ఆశావాదులు ఓటరు లిస్టులో నిమగ్నమయ్యారు. వార్డుల వారీగా ఓటరు లిస్టు పరిశీలించుకుంటున్నారు. గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. నువ్వా నేనా అన్నట్లుగా ఎవరికి వారే ప్రచారాన్ని మొదలుపెట్టారు.


ఓటరు లిస్టును పరిశీలిస్తున్న నాయకులు

రవీందర్‌కు విరాహత్ అలీ పరామర్శ

నిర్మల్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రిపోర్టర్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ మోకాలి చిప్ప శస్త్ర చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.విరాహత్ అలీ గురువారం సాయంత్రం ఆస్పత్రిని సందర్శించి రవీందర్‌ను పరామర్శించారు. రవీందర్ ఆరోగ్య పరిస్థితి, శస్త్ర చికిత్స వివరాల గురించి ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని విరాహత్ అలీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా రవీందర్ పాత్ర, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా విరాహత్ అలీ కొనియాడారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే తమ సభ్యులకు ఆరోగ్య పరమైన ఆపద సమయాల్లో తోడుగా నిలబడాలనే లక్ష్యంతో పని చేస్తుందని, జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమానికి యూనియన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రవీందర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ స్థానిక జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


నిమ్స్‌లో రవీందర్‌ను పరామర్శిస్తున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు

నర్సాపూర్(జి)లో సర్పంచ్‌ల పోరు

» యువ నేతల మధ్య హోరాహోరీ

నర్సాపూర్(జి), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు యువ నాయకుల మధ్య రసవత్తరంగా మారాయి. అనుభవజ్ఞులైన సామాజిక కార్యకర్త బర్కుంట నరేందర్, న్యాయశాస్త్ర పట్టభద్రుడు కట్కం అజయ్ కుమార్ ప్రధాన అభ్యర్థులుగా బరిలో నిలిచారు. గతంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పని చేసిన అనుభవం ఉన్న బర్కుంట నరేందర్.... తాను అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జనరల్ స్థానంలో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో తాను చేపట్టిన పనులైన శాశ్వత లైటింగ్ ఏర్పాటు, దేవాలయాలకు రంగులు వేయించడం, డ్రైనేజీ నిర్మాణ, హాస్పిటల్ కోసం నిరాహార దీక్ష వంటివిని తన బలాలుగా పేర్కొంటున్నారు. నర్సాపూర్‌ను దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యావంతుడైన కట్కం అజయ్ కుమార్ తన జ్ఞానాన్ని గ్రామ సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తానని తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, సమగ్ర పారిశుధ్య, యువతకు ఉద్యోగ సహాయం, క్రీడా మైదానం ఏర్పాటు, రైతులకు మద్దతు ధర, ప్రభుత్వ పథకాల పారదర్శకత వంటి అంశాలను తన ప్రధాన ప్రణాళికలుగా ప్రజల ముందు ఉంచారు. నర్సాపూర్‌ను రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ ప్రధానాంశాలుగా ఈ ఇద్దరు అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. గ్రామ భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికలపై ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.


కుంటాలలో రెండో రోజు కొనసాగుతున్న రైతు దీక్ష

కొనసాగుతున్న రైతు దీక్ష

కుంటాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఇది వరకు తూకం వేసిన సోయా బస్తాలతో పాటు తూకం వేయని సోయాలను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ మండల కేంద్రం కుంటాలలో రైతు పడకంటి దత్తు చేపడుతున్న రైతు దీక్ష గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు పలు పార్టీల నాయకులు ఆయన దీక్షకు సంఘీభావం తెలిపారు. సోయాలను తరలించే వరకు తన దీక్ష కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాతృత్వ సేవలు సకాలంలో అందించాలి

» నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సకాలంలో మాతృత్వ సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలోని ఆశా నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు సకాలంలో సేవలు అందించి మాతృ మరణాలను తగ్గించాలని కోరారు. ముఖ్యంగా మహిళలు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన పోషకాహారం గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. అదే విధంగా గర్భవతిగా ఉన్నప్పుడు కనిపించే ప్రమాదకర లక్షణాల గురించి అవగాహన కల్పించి వెంటనే ఆరోగ్య సేవలు పొందే విధంగా చూడాలని తెలియజేశారు. తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, జిల్లా డాటా మేనేజర్ గంగాధర్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ సాయమ్మ, జిల్లాలోని ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

వైభవంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఖానాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాజీ నగర్ కాలనీలో గల మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో చండీ హోమం నిర్వహించారు. ఈ వేడుకలకు తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బక్కశెట్టి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు కారింగుల గోపాల్ కిషన్, ప్రధాన కార్యదర్శి ద్యావతి రాజేశ్వర్, కోశాధికారి కారింగుల రాములు, ఉపాధ్యక్షులు గుగ్గిళ్ల రాజేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, కరిపే శ్రీనివాస్, బక్కశెట్టి కిషోర్, వెంకట్ మహేంద్ర, సందీప్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు


మహిళా ఓటర్లే కీలకం



ఉట్నూర్‌లో పురుష ఓటర్ల కన్నా అధికంగా మహిళా ఓటర్లు

ఉట్నూర్, నవంబర్27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎట్టకేలకు ప్రకటించిన గ్రామ పంచాయతీలో ఎన్నికల నోటిఫికేషన్‌తో పల్లెపోరు ప్రారంభమైంది. పల్లెపోరులో సైతం పురుషుల కంటే మహిళా ఓట్లే అధికంగా కనిపిస్తున్నాయి. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 18 గ్రామ వార్డులతో పాటు పంచాయతీ సర్పంచ్ ఎన్నుకోవడానికి మొత్తం 12622 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 6237 కాగా మహిళలు 6385 మంది ఉన్నారు. బాబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 8 వార్డులకు గాను మొత్తం 405 మంది ఓటర్లు ఉండగా మహిళలు 201 కాగా పురుషులు 203 మంది ఉన్నారు. బీరుసాయిపేట గ్రామ పంచాయతీలో 10 వార్డులకు గాను మొత్తం ఓటర్లు 1735 ఉండగా పురుషులు 843, మహిళలు 892 మంది, చందూరి గ్రామ పంచాయతీలో 1376 మంది ఓటర్లు కాగా 668 పురుషులు, 70 మంది మహిళలు, చెరువు గుణం పంచాయతీలో 611 మంది ఓటర్లు కాగా 307 మంది పురుషులు, మూడుస్నున్నా నాలుగు మహిళలు, చింతకర్ర పంచాయతీల్లో 421 మంది ఓటర్లకు గాను 190 పురుషులు, 233 మహిళలు, దంతనపల్లి పంచాయలో 153 ఓటర్లు కాగా 738 పురుషులు, 795 మహిళలు ఉన్నారు.

దొంగచింత పంచాయతీలో 552 మంది ఓట ర్లు కాగా 277 మంది పురుషులు, 275 మంది మహిళలు, గంగాపూర్ పంచాయతలో 1045 ఓటర్లు కాగా 538 పురుషులు, 507 మహిళలు, ఘన్పూర్ పంచాయతీలో 973 ఓటర్లు కాగా 456 పురుషులు, 517 మమిళలు, గోండుగూడ జీలో 1365 ఓటర్ల కాగా 640 పురుషులు, 725 మహిళలు, హస్నాపూర్ గ్రామ పంచాయతీలో 2446 ఓటర్లు కాగా 1207 పురుషులు, 1239 మహిళలున్నారు. హీరాపూర్‌జె పంచాయతీలో 824 ఓటర్లు కాగా 396 పురుషులు, 428 మహిళలు, జైత్రం తండా పంచాయతీలో 545 ఓటర్లు కాగా 257 పురుషులు, 288 మహిళలు, కామాయిపేట పంచాయతీలో 676 ఓటర్లు కాగా పురుషులు 3222, మహిళలు 354, కన్నాపూర్ పంచాయతీలో 663 ఓటర్లు బాగా 322 పురుషులు, 341 మహిళలు, కుమ్మరితండా పంచాయిలో 872 ఓటర్లు కాగా 445 పురుషులు, 427 మహిళలు, లక్కారం పంచాయతీలో 4325 మంది ఓటర్లు కాగా 2974 మహిళలు 2251, లక్షేటిపేట పంచాయతీలో 709 మంది ఓటర్లు కాగా 347 పురుషులు, 362 మంది మహిళలున్నారు



మారుగూడ పంచాయతీలో 484 మంది ఓటర్లు కాగా 237 పురుషులు, 247 మహిళలు, మత్తడుగుల పంచాయతీలో 770 మంది ఓటర్లు 367 పురుషులు, 403 మంది మహిళలు, లడ్డంగూడా పంచాయతీలో 1192 మంది ఓటర్లు కాక 608 పురుషులు, 584 మహిళలు, నాగపూర్ పంచాయతీలో 730 ఓటర్లు కాగా 370 మంది పురుషులు 360 మంది మహిళలు, నర్సాపూర్ బీ పంచాయతీలో 1945 మంది ఓటర్లు కాగా 987 మంది పురుషులు, 958 మంది మహిళలు నర్సాపూర్ జె పంచాయతీలో 336 ఓటర్లు కాగా 177 పురుషులు, 159 మహిళలు, పులిమడుగు పంచాయతీలో 1003 మంది ఓటర్లు కాగా 495 మంది పురుషులు, 508 మంది మమిళలున్నారు.

సాకెర జె పంచాయతీలో 480 మంది ఓటర్లు కాగా 229 మంది పురుషులు, 251 మంది మహిళలు, సాలెవాడ బి పంచాయతీలో 1342 మంది ఓటర్లు కాగా 707 మంది పురుషులు, 635 మంది మహిళలు, షాంపూర్ పంచాయతీలో 1843 మంది ఓటర్లు కాగా 905 మంది పురుషులు, 938 మంది మహిళలు, శ్యామ్‌నాయక్ తండా పంచాయతీలో 1175 ఓటర్లు కాగా 579 పురుషులు, 596 మహిళలు, తక్కువ కూడా పంచాయతీలో 439 ఓటర్లు కాగా 219 పురుషులు, 220 మంది మహిళలు, తాండ్ర పంచాయతీలో 638 మంది ఓటర్లు కాగా 327 పురుషులు, 311 మంది మహిళలున్నారు.

ఉమ్మడి పంచాయతీలో 1289 ఓటర్లు కాగా 669 మంది పురుషులు, 619 మహిళలు, వెడగల్వార్‌కె పంచాయతీలో 605 మంది ఓటర్లు కాగా 306 మంది పురుషులు, 298 మంది మహిళలు, ఏంది ఆ పంచాయతీలో 928 మంది ఓటర్లు కాగా 460 మంది పురుషులు, 468 మంది మహిళలున్నారు. లింగోజితండా ఎక్స్‌రోడ్డు పంచాయతీలో 1286 మొత్తం ఓటర్లు కాగా 620 పురుషులు ఉండగా 662 మంది మహిళా ఓటర్లున్నారు. ఉట్నూర్ మండలంలో 38 గ్రామ పంచాయతీల పరిధిలో 51642 మంది ఓటర్లు ఉన్నారు.

క్రైం సమాచారం

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

▸▸ ప్రమాదంలో రూ.ఆరు లక్షల వరకు ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న గ్రామస్థులు

ముథోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మజీద్‌చౌక్ సమీపంలో గల గడ్డమొల్ల రమేష్ అనే వ్యక్తి ఇల్లు గురువారం ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం.. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకొని ఇంట్లో ఉన్న కిరాణషాప్‌నకు సంబంధించిన సామగ్రి సుమారు రెండు లక్షలు, బీరువాలో ఉన్న కొంత నగదుతో పాటు సుమారు రూ.4 లక్షల విలువ కలిగిన బంగారు నగలు మొత్తం రూ.ఆరు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని వాపోయారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల వ్యాపించిన మంటలను గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే స్పందించి వ్యాపించకుండా ప్రయత్నం చేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఇంట్లో ఉన్న సిలిండర్‌కు మంటలు వ్యాపించకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్, ఆర్ఐ నారాయణరావు పటేల్, జీపీవో నర్సయ్యలు ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడంతో ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఉరివేసుకొని ఒకరి మృతి

సారంగాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల మహబూబ్‌ఘాట్ వద్ద గురువారం అల్వేచరణ్(25) అనే యువకుడు చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన అల్వే చరణ్, అనే యువకుడు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో పెళ్లి సంబంధాలు రావడం లేదని మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఉట్నూర్, నవంబర్27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన యూసఫ్ (48) మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడి భార్య భాను తెలిపిన వివరాల ప్రకారం... కొన్నేళ్ల క్రితం వివాహం జరిగినా సంతానం కాకపోవడంతో మద్యానికి తన భర్త బానిసయ్యాడని తెలిపింది. బుధవారం సాయంత్రం మద్యానికి డబ్బులు ఇవ్వమని అడగడంతో తన వద్ద ఉన్న కొన్ని డబ్బులు ఇవ్వగా తాగి వచ్చి ఇంకా డబ్బులు కావాలంటూ గొడవపడ్డాడన్నారు. తాను పక్క వీధిలో తెలిసినవారి ఇంట్లో ఉండిపోయానని, రాత్రి వచ్చేసరికి ఇంట్లో ఉరివేసుకుని ఉన్నాడని తెలిపింది. గురువారం ఉదయం ఉట్నూర్ పోలీసులు పంచనామా నిర్వహించి ఉట్నూర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అంత్యక్రియల కోసం బంధువుల సహాయంతో మహారాష్ట్రకు ఆమె భర్త మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నార్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాదాపూర్ గ్రామానికి చెందిన కాంబ్లే హన్మంతు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు నార్నూర్ ఎస్సై కె.అఖిల్ తెలిపారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట అడ్డాపై పోలీసుల దాడి

● తప్పించుకున్న జూదరులు

బోథ్, నవంబర్27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని పంటచేలలో కొంత మంది పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో గురువారం పేకాట అడ్డాపై పోలీసులు దాడి చేశారు. అయితే పోలీసుల రాకను గమనించిన జూదరులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. అయితే పేకాట అడ్డకు సమీపంలో నిలిపి ఉంచిన మూడు ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. తప్పించుకున్న వారు పట్టణానికి చెందిన ప్రముఖులేనని పలువురు అంటున్నారు.

భవనం పైనుంచి పడి విద్యార్థికి గాయాలు

దస్తురాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనం పైనుంచి పడి విద్యార్థికి గాయాలైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాందేవ్ తెలిపారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఆత్రం నగేష్ అనే విద్యార్థి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడటంతో తలకు తీవ్ర గాయాలైనట్లు పేర్కొన్నారు. దీంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

తానూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హిప్నెల్లి తండా గ్రామానికి వెళ్లే మార్గంలో ఓ షాపులో అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. తానూర్ నుంచి హిప్నెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న బెల్టు షాపులో మద్యం సీసాలు నిల్వ ఉంచి అధిక ధరలకు అమ్ముతుండగా, షాపులో దాడులు నిర్వహించి రూ.4వేల విలువగల మద్యాన్ని పట్టుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.





ముత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తుంరం మారుతి నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం (ఎడమవైపు) గురువారం ఉట్నూర్ మినీ బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న మాజీ సర్పంచ్ యశోదబాయి

ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ

మొదటి రోజు నలుగురు సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ

ఇంద్రవెల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో డిసెంబర్ 11న నిర్వహించే సర్పంచ్ ఎన్నికల నామినేషన్ స్వీకరణ గురువారం ప్రారంభమైంది. మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా మొదటిరోజు మండలంలో నలుగురు సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి తొడ సం లక్ష్మీబాయి, ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా ఆర్క ఖమ్ము, ఏమాయికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి జాదవ్ లఖన్, ముత్నూర్ గ్రామ పం చాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తుంరం మారుతీలు నామినేషన్లు వేసినట్లు మండల ఎన్నికల నిర్వహణ అధికారి జీవన్‌రెడ్డి తెలిపారు. కాగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఎస్సై ఇ.సాయన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌వోలు, ఏఆర్‌వోలు ఉన్నారు.

ఒకవైపు నామినేషన్లు, మరోవైపు కూరగాయల వ్యాపారం

ఉట్నూర్ : ఒక వైపు గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్‌ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కాగా మండలంలోని మత్తడిగూడా మాజీసర్పంచ్ మడావి యశోదబాయి మాత్రం గురువారం మండల కేంద్రంలోని మినిబజార్‌లో కూరగాయలు అమ్ముతూ కనిపించారు. దుర్గాపూర్‌కు చెందిన యశోదబాయి తమకు ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు పండించడంతో పాటు విక్రయిస్తూ క్షేత్రంలో కూరగాయలు పండించడంతో పాటు విక్రయిస్తూ ఉంటారు. ఆమె భర్త మడావి మోతిరాం ఈసారి జరుగనున్న ఎన్నికల్లో మత్తడిగూడ పంచాయతీకి సర్పంచ్ జనరల్‌గా ప్రకటించడంతో పోటీచేస్తున్నారని, అందుకే తాను కూరగాయలు విక్రయిస్తున్నానని తెలిపింది.



ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్‌లో నామినేషన్లను స్వీకరిస్తున్న అధికారులు

మొదటిరోజు 12 నామినేషన్లు

ఇచ్చోడ : నామినేషన్ల స్వీకరణ మొదటి రోజైన గురువారం 5 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోని మొత్తం 8 క్లస్టర్లు కాగా మొత్తం సర్పంచు స్థానాలకు 6, వార్డు స్థానాలకు 6 నామినేషనల్లను దాఖలు చేశారు. ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామపంచాయితీలో 1. ఆసీఫ్ ఆలీ, కామగిరి పంచాయితీలో 2. ఎల్ రమేష్, 3. నిమ్మల సుప్రియ, 4. ముక్రా(బి) పంచాయితీలో అడవ్ సురేఖ 5. అనసూయ, ముక్రా పంచాయతీ వార్డు సభ్యులు అరుణ, శ్యాంసుందర్, శేఖర్, పుష్పలతలు ఆ గ్రామపంచాయితీ పరిధిలోని క్లస్టర్లలో నామినేషన్లను దాఖలు చేశారు. 2నెల 29వ తేదీన నామినేషన్ల స్వీకరణకు తుదిగడువు అని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలకు కులధ్రువీకరణ పత్రంతో పాటు ఇతర పత్రాలు జతచేయాలన్నారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సహా కొత్త బ్యాంకు ఖాతా ఉండాలని సూచించారు.

నార్నూర్ మండలానికి ఐదు నామినేషన్లు దాఖలు

నార్నూర్ : మండలంలో గురువారం పలు నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదు క్లస్టర్లకు గురువారం సర్పంచ్‌స్థానానికి 5, వార్డ్ మెంబర్‌కు రెండు నామినేషన్ పత్రాలు వచ్చినట్లు ఎంపీడీఓ పుల్లారావు గురువారం తెలిపారు.

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

నర్సాపూర్(జి), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు కోసం యావత్ తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని సీనియర్ న్యాయవాది అజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కోర్టు ఇచ్చే తీర్పు ఎన్నికల భవిష్యత్తును నిర్ణయించనుందన్నారు. హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియ తిరిగి ప్రారంభమైతే తాను సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.



ఎన్టీఆర్ చౌక్ వద్ద వృథాగా పోతున్న మంచినీరు



కలెక్టర్ చౌక్ ఆటో స్టాండ్ వద్ద



నీటి వృథా..

రోజుల తరబడి వేల లీటర్ల మిషన్ భగీరథ నీరు వృథాగా పో తుంది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీలకు అడ్డుకట్ట వేయడంలో సిబ్బంది విఫలమవుతుండడంతో శుద్ధ జలం మురికి కాలువల్లోకి ప్రవహిస్తోంది. రోజుల తరబడి వేలలీటర్ల మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద మంచినీరు వృథాగా పోతుంది. అలాగే కలెక్టర్‌చౌక్ ఆటోస్టాండ్ వద్ద, ఆర్ అండ్‌బీ ఆఫీస్ ఎదుట వరకు బురదమయంగా మారింది. మిషన్ భగీరథ నీరు మోరి పాలవుతోంది. - ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఆర్అండ్‌బీ ఆఫీస్ ముందు

గండి రామన్న ఆలయం ముస్తాబు



మాట్లాడుతున్న లక్కిడి జగన్మోహన్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రం దత్తజయంతి వేడుకలకు ముస్తాబైంది. వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకు మూడురోజులపాటు ఈ వేడుకలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో తొలిరోజైన మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు అఖండ సాయి నామ సంకీర్తన కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో భూమయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దత్త జయంతి వేడుకల వివరాలను ఆయన వెల్లడించారు. 48 గంటల పాటు ఈ సాయి సంకీర్తన కార్యక్రమం నిరాటకంగా కొనసాగుతుందని, ఆ సమయంలో ఆలయం తెరిచే ఉంటుందన్నారు. చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్ తదితర గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది సభ్యుల భజన బృందం ఈ సంకీర్తనలో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, సభ్యులు మహేందర్ యాదవ్, జొన్నల మనోహర్, జిందం గోవర్ధన్, ఉప్పుల నందు, తిరుపతి, కోల శంకర్, జనార్ధన్, సోమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ప్రదీప్



ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్‌ను సన్మానిస్తున్న మండల ప్రముఖులు

ఖానాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రధాన ఆలయమైన శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పట్టణ ప్రముఖులతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రముఖులు సాయిబాబా, జంగల్ హనుమాన్ భక్తులు హాజరయ్యారు. మూడుగంటల పాటు సాగిన సమావేశంలో అందరి ఏకాభిప్రాయం మేరకు ఖానాపూర్ విద్యానగర్ కాలనీకి చెందిన కొక్కుల ప్రదీప్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని, నూతనంగా ఎన్నికైన అధ్య క్షుడు ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఆలయ కమిటీ అధ్య క్షుడు అంకం రాజేందర్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రామునాయక్, మాజీ సర్పం చ్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, మాజీ ఎంపీటీసీలు కొండాడి గం గారావు, బీసీ రాజన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న, పట్టణాధ్యక్షుడు గౌరీకర్ రాజు, పలు పార్టీల జిల్లా నాయకులులున్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ



విజేతపత్రం అందిస్తున్న కన్వీనర్ గంగాధర్

భైంసా రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండల ఒలంపియాడ్ ఇంగ్లీష్ ఎడ్యుకేట్ టాక్ పరీక్షల కన్వీనర్లు ఎస్.గంగాధర్, ఎం.లక్ష్మీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులు సీనియర్ విభాగంలో జుబియా, మూవీస్‌లు ఎంపికయ్యారు. జూనియర్ విభాగంలో అనసూయ, నవ్య, రజిని విద్యార్థులు ఎంపికయ్యారు. వచ్చే నెలలో 17వ తేదీన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల స్థాయి కన్వీనర్లు గంగాధర్, లక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, ప్రధానోపాధ్యాయులు గంగా ప్రసాద్, ఉపాధ్యాయులు పా ల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో మండల స్థాయిలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉపన్యాసంలో మండల స్థాయి సీనియర్స్‌లో ప్రథమ స్థానంలో ఐశ్వర్య, జూనియర్ ప్రథమ స్థానంలో అనిత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా చెకుముకి టాలెంట్ పరీక్షల్లో మండలస్థాయిలో విద్యార్థినులు ఐశ్వర్య, అనిత, ప్రతిక్ష గ్రూపు మొదటి స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయులు గీత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈపీఎఫ్‌పై అవగాహన

ఉట్నూర్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్(ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్)పై జిల్లా అవగాహన సదస్సు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రీజినల్ ఆఫీస్ కరీంనగర్ నుంచి నోడల్ ఆఫీసర్ అమిత్‌కారత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు ప్రతి ఒక్కరికీ యూఏఎన్ నంబర్ తీసుకుని ఈపీఎఫ్ ఖాతాలో పొదుపు చేయాలన్నారు. వాటి వల్ల ఉద్యోగులకు అధిక వడ్డీతో అనేక సౌకర్యాలు కల్పించవచ్చన్నారు. నోడల్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ సమస్యల పరిష్కారానికి చందాదారులకు ఎల్లప్పుడు వారి సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లాలోని వివిధ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుభాస్, భానుప్రసాద్, రంజిత్, సతీష్, మోతిలాల్, అరు ణ్, అనిల్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్ జన్మదిన సందర్భంగా లోకేశ్వరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ముథోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ రానున్న రోజుల్లో మరింత ప్రజాసేవా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుధీర్‌రెడ్డి, షఫీ, హర్షప్రసాద్, రామ్‌చందర్ రావు, వెంకటేశ్వర్లు, భీమ్ రావు, నవీన్, పాల్గొన్నారు.

చలన చిత్ర ప్రదర్శన

ముథోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జీవిత చరిత్రపై, రాజ్యాంగం నిర్మించడంలో ఆయన పాత్రకు సంబంధిం చిన చలన చిత్రాన్ని ప్రదర్శించారు. చలనచిత్రాన్ని తిలకించడానికి గ్రామస్థులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కూరగాయాలు



దస్తురాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్‌లో కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టమాట, ఉల్లిపాయ, బీరకాయ, వంకాయ, పచ్చిమిర్చి ధరలు గత పక్షంతో పోల్చితే దాదాపు 30 నుంచి 60 శాతం వరకు పెరిగాయి. సాధారణ కుటుంబాల నెలవారీ ఖర్చులు రెట్టింపు అవ్వడం వల్ల గృహిణులు కొనుగోళ్లు తగ్గించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న రవాణా కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో వినియోగదారులు సరైన ధరలకు ప్రత్యామ్నాయాలు వెతికే పరిస్థితి వచ్చింది. వ్యాపారుల సమాచారం మేరకు వరుస వానలు, పంటల్లో వ్యాధులు, సాగు ఖర్చుల పెరుగుదల, రవాణా వ్యయాల పెంపు వంటి అంశాలు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి సరఫరా అయ్యే కూరగాయలు మార్కెట్‌కు చేరేలోపే రవాణా ఖర్చులు భారీగా పెరగడంతో అమ్మకపు ధరలు సహజంగానే అధికమవుతున్నాయని తెలిపారు. స్థానిక రైతులు కూడా తక్కువ దిగుబడి కారణంగా మార్కెట్ అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతున్నారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. ధరలు తగ్గే అవకాశాలపై అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

దస్తురాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో సమావేశమై నామినేషన్ కేంద్రాల్లో భద్రత, పారదర్శకత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ బందోబస్తు, క్యూలైన్ల ఏర్పాటు, త్రాగునీరు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. సమయ పట్టికకు అనుగుణంగా నామినేషన్ ప్రక్రియ కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, ఎంపీడీవో అరుణ, ఎంపీవో రమేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



పెంబి మండలంలో ఇటిక్యాల్ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి



దస్తురాబాద్ మండలంలో సర్పంచ్ నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి



నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారుల బృందం

పల్లెల్లో మొదలైన ఎన్నికల కోలాహలం

- తొలిరోజు మందకొడిగా సాగిన నామినేషన్ల పర్వం
- అభ్యర్థుల ఎంపికలో ఏకాభిప్రాయానికి ప్రధాన పార్టీల తంటాలు
- పలుచోట్ల రంగంలోకి దిగిన సమన్వయ కమిటీలు
- ఓ వైపు నామినేషన్ల పర్వం మరోవైపు రెబల్ అభ్యర్థుల బుజ్జగింపు
- నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు, జిల్లా కలెక్టర్
- ఆరు మండలాలలో మొదటి రోజు సర్పంచ్ పదవికి 89 నామి నేషన్లు దాఖలు

ఖానాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మొదలైంది. రెండేళ్ల కాలంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల కోసం వేచి చూస్తున్న అభ్యర్థులంతా తమ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో పల్లెల్లో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. ఇన్నాళ్లు స్థానిక సంస్థల ఎన్నికలు లేక స్తబ్దుగా ఉన్న నాయకులంతా ఇప్పుడు పంచాయతీ ఎన్నికల బరిలో నిలవాలని యోచిస్తున్న నేపథ్యంలో మూడు ప్రధాన పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలో నిలిపేందుకు పావులు కలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మొదటి విడతలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నిర్మల్ జిల్లాలోని దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, పెంబి, మామడ, లక్ష్మణచాంద ఆరు మండలాల్లో పల్లెలన్నిం టికీ ఒక్కసారిగా రాజకీయ రంగు పులుముకుంది.

అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీల తంటాలు

గత రెండేళ్లుగా ఎటువంటి పదవులు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల కోసం వేచి చూస్తున్న నాయకులంతా ఒక్కసారిగా పల్లెపోరులో బరిలో నిలిచేందుకు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఒక్కో పార్టీలో సర్పంచ్ పదవి కోసం ముగ్గురు, నలుగురు అభ్యర్థులు ముందుకు వస్తున్నారు. ఒక్కోచోట ఏకంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి పది మంది అభ్యర్థులు బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపుతుండడంతో అభ్యర్థులు బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపుతుండడంతో తాము బలపరిచే పార్టీ అభ్యర్థుల నడుమ ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తంటా లు పడుతున్నారు.

మందకొడిగా నామినేషన్ల పర్వం...

మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించనున్న నిర్మల్ జిల్లాలోని దస్తురాబాద్, పెంబి, మామడ, లక్ష్మణచాంద మండలాల్లో ఈ నెల 27 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు ఎన్నికల కమిషన్ గడువు విధించింది. ఈ నేపథ్యంలో తొలి రోజు గురు వారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగలేదు. మొదటి రోజు అభ్యర్థుల నడుమ ఏకాభిప్రాయాలు కుదరకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేదు. ఓవైపు బుజ్జగింపుల పర్వం కొనసాగుతుండగానే మరోవైపు శుక్రవారం సెంటిమెంట్‌గా కొంతమంది అభ్యర్థులు నేడు నామినేషన్ వేసేందుకు సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆరు మండలాల్లో 136 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవి కోసం తొలిరోజు కేవలం 89 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. ఈ 136 గ్రామ పంచాయతీల పరిధిలో గల 1072 వార్డులకు కేవలం 26 నామినేషన్లు మాత్రమే దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ



అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరిస్తున్న అధికారులు

దస్తురాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మొదటి విడతలో భాగంగా గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మున్యాల్, బుట్టాపూర్ గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశా మన్నారు. తొలి రోజున 13 సర్పంచ్ స్థానాలకు ఆరు, 102 వార్డు సభ్యులకు మూడు నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. ఎన్నికల రిట ర్నింగ్ అధికారి మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా కొనసాగుతోందని తెలిపారు. నిర్ణీత సమయాల్లోనే నామినేషన్లు స్వీకరించబడతాయని, అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచాలని అభ్యర్థులకు సూచించారు.

పెంబి మండలంలో..



ఇటిక్యాల్‌లో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి

పెంబి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా గురువారం పెంబి మండలంలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుంది. పెంబి మండలంలో నాలుగు క్లస్టర్లు పెంబి, మందపల్లి, ఇటిక్యాల్, వెంకంపోచంపాడ్‌లలో ఏర్పాటు చేశారు. పెంబిలో 4, మందపల్లిలో 3, ఇటిక్యాల్‌లో ఒకటి నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. అందరూ సర్పంచ్ అభ్యర్థులే, వార్డు మెంబర్లకు నామినేషన్ జీరో. నా మినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పెంబి ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ లక్ష్మణ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. పెంబి ఎస్సై గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమానికి విరాళాలు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

అనాథ వృద్ధాశ్రమానికి విద్యార్థుల చేయూత

నిర్మల్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్ వశిష్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు తమవంతు సహాయంగా విరాళాలు (రూ. 18,850) సేకరించి శ్రీ సాయి అనాథ వృద్ధాశ్రమం మంచిర్యాల వారికి అందజేసి నట్లు పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఈ విధంగా సేవా దృక్పథంతో ముందుకు రావడం గొప్పదని ఈ వయసు నుంచే వారిలో సేవా భావన నేర్పించడం ముఖ్యమని, అనాథ అని అనుకునే వాళ్లకి ఈ విధంగా మనం అందరంతో దున్నామని తెలపాలని కోరుతూ విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధిక మొత్తంలో విరాళాలు సేకరించిన పిల్లలకు మెడల్స్ ప్రదానం చేసినట్లు తెలిపారు.

నామినేషనక్లు ఏర్పాట్లు పూర్తి

- మూడు రోజుల పాటు 4 క్లస్టర్లలో స్వీకరణ సిద్ధం

నర్సాపూర్(జి), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరగబోయే ఎన్నికలకు నామినేషన్ల పర్వానికి ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పక్కా ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో పుష్పలత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొత్తం 27 పోలింగ్ స్టేషన్లలో ఉన్న 20,231 మంది ఓటర్లు తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకోనున్నారు. నామినేషన్ పత్రాలను అధికారులు ఆది, సోమ, మంగళ మూడు రోజులు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరి స్తారు. స్వీకరణ కేంద్రాలుగా మండల కేంద్రం (ఎంపీడీవో కార్యాలయం), చాక్‌పల్లి, రాంపూర్, గొల్లమాడ అనే 4 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు (ఆర్‌వో), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌వో) స్వీకరిస్తారు. అభ్య ర్థులు నామినేషన్ ఫారం, ఫారం-26 అఫిడవిట్ (నేర చరిత్ర, ఆస్తులు, విద్యార్హతల వివరాలతో కూడిన నోటరీ చేయించిన పత్రం), ఓటరు జాబితా కాపీ, రిజర్వేషన్ ధ్రువీకరణ పత్రం, సెక్యూరిటీ డిపాజిట్ రసీదు, వయో ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలి. ఈ పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (టీఎస్ఈసీ) లేదా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వెబ్ సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నామినేషన్ దాఖలుకు ముందు రిటర్నింగ్ అధికారి వద్ద తుది చెక్‌లిస్ట్‌ను తప్పనిసరిగా ధ్రువీక రించుకోవాలని ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది సూచించారు. ఈ ఏర్పాట్లలో మండల పంచాయతీ అధికారి తిరుపతి రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రమేష్, ఇతర సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్లకు దరఖాస్తు ఫారాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది దృశ్యం

పంచాయతీ ఎన్నికలపై ఫిర్యాదులుంటే సంప్రదించండి

- ఎన్నికల జిల్లా పరిశీలకురాలు ఆయేషా మస్రత్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు దశల్లో నిర్వహించబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు తమను సంప్రదించవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అటవీ శాఖ వసతి గృహం నందు తాము అందుబాటులో ఉంటామని, ఎన్నికలపై ఫిర్యాదులను ఇవ్వాలనుకున్నవారు నేరుగా సంప్రదించి, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. లేదా 99592 84786 ఫోన్ నెంబర్ ద్వారానైనా ఫిర్యాదులపై సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. అబ్జర్వర్ జీపీనిర్మల్@జీ మెయిల్.కామ్ మెయిల్ ఐడీ ద్వారా ఫిర్యాదులను వ్యక్తపరచవచ్చునని వివరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఫిర్యాదులను నిర్భయంగా ఇవ్వవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు ఆ ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు



కలెక్టర్ అభిలాష అభినవ్‌కు పూల మొక్క అందజేస్తున్న సలావుద్దీన్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు వ్యయ పరిశీలకులుగా నియమించబడ్డ సయ్యద్ సలావుద్దీన్ గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు పూల మొక్కలను అం దజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇరువురు గ్రామ పం చాయతీ ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

పారదర్శకతతో విధులు నిర్వర్తించాలి

- మునిసిపల్ అధికారులతో సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అజ్మీరా

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పారదర్శకమైన విధానాలతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులను నిర్వర్తించాలని భైంసా మున్సిపల్ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారులు, సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎల్టా నాయకులు

ఇంగ్లిష్ ఒలింపియాడ్ పోటీలతో భాషపై పట్టు

- ఎల్టా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
- మండల స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ ఎడ్యేకేట్ టాక్ పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ ఒలింపియాడ్ ఎడ్యుకేట్ టాక్ పోటీలు భాషపై పట్టును మరింత పెంపొందిస్తాయని ఎల్టా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొప్పుల వేణుగోపాలరావు, అల్లూరి రామ్మోహన్, ఫైనాన్స్ సెక్రటరీ రతన్ కులకర్ణి, సెక్రటరీ ఇర్ఫాన్ షేక్, సీనియర్ ఇంగ్లిష్ జడ్జి ముత్తన్న తదితరులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ ఎడ్యుకేట్ కాంపిటీషన్స్ పోటీల నిర్వహణ సందర్భంగా వారు ప్రశ్నాపత్రాలను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు.

పల్లెల్లో పంచాయతీ పండుగ



- బరిలో దిగేందుకు పోటాపోటీ ఉత్సాహవంతుల ఆసక్తి...!
- పోటీకి సై అంటున్న యువత
- పది మంది కలిస్తే స్థానిక ఎన్నికలపై చర్చ

ముథోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పోరుకు సన్నద్ధం అయిన నేపథ్యంలో ఇటీవలనే సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్థానిక స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేసింది. పల్లెల్లో పంచాయతీ పండుగ వాతావరణం నెలకొంది. ఆశావహులు ఉత్సాహంతో ఉన్నారు. ముఖ్యంగా యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈసారి రిజర్వేషన్లు అనుకూలించిన వారు పోటీ చేస్తామని చర్చ జరుగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత, తాజా మాజీలు కసరత్తు చేస్తున్నారని చెప్పుకోవచ్చు. ముథోల్ నియోజకవర్గంలోని ఆశావహులు తమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ వారీగా ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు ఓటరు లిస్ట్ నివేదికను సిద్ధం చేసి ఎన్నికలకు సంసిద్ధంగా ఉంది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఆశావహులు తమ కసరత్తును మొదలుపెట్టారు.

బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్న నేతలు

ఈ సారి ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ కొందరు నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్నారు. తమ కుల సంఘాలకు కొందరు నాయకులు ఇప్పటి నుంచే మాట చేరవేస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలం వచ్చింది. నేను పోటీ చేస్తాను మీ మద్దతు మాకే కావాలంటూ గుసగుసలు మొదలయ్యాయి. ఈసారి అధిక సంఖ్యలో ఆయా గ్రామాల్లో యువత పోటీ చేసేందుకు ఆసక్తి కనబడుతున్నట్టు తెలుస్తుంది. అయితే ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తాను చాటేందుకు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నట్లు నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో తమ అనుచర గణాన్ని సర్పంచ్‌గా గెలిపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకున్నాయని చెప్పుకోవచ్చు. ఆశావహులు తమ కసరత్తును మొదలు పెట్టారు. నియోజకవర్గంలోని ముథోల్, బాసర, భైంసా మండలాల్లో మూడవ విడతలో ఎన్నికలు జరగనున్నాయి.



స్థానిక ఎన్నికల్లో ఎక్కువ శాతం బరిలో యువత

స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో యువతనే ఎక్కువ శాతం బరిలో దిగేందుకు ఆసక్తి చూపనున్నట్లు తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లో అయితే నాయకులు ఇల్ ఓట్లు ఆకర్షించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గుమిగూడిన పది మంది ఉన్నచోట నాయకులు వెళ్లి వారిని పలకరించడం చేస్తున్నారు. ఈ సారి అవకాశం వచ్చింది... పోటీ చేస్తానంటూ కాక అని, అన్న, తమ్ముడు అంటూ వరుసలు పెట్టి పలకరిస్తున్నారు. మన గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, గ్రామం రూపు రేఖలు మారుస్తానని చెబుతున్నారు. ముథోల్‌లోని పలు గ్రామాల్లో యువకులు తమ మద్దతు ఇవ్వండి నేను పోటీ చేస్తానని, నీ కోసమే నీ మాట కోసమే ఎదురుచూస్తున్నానని రాయబారాలు పెడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. మీ కుల సంఘం మద్దతిస్తే నాకు విజయం ఖాయం అంటూ బరిలో దిగే నాయకులు ఇప్పటి నుండే ఓట్ల కోసం కాక పడుతున్నారు.

గెలుపే ధ్యేయంగా ప్రణాళికలు

గత మూడు రోజుల నుంచి ఇక్కడి ప్రాంతాల్లో పంచాయతీ సంగ్రామానికి సై అంటే సై అంటూ ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు కాక, తమ్ముడు, అన్న, మామ అంటూ వరుసలు పెట్టి పలకరిస్తున్నారు. గెలుపే ధ్యేయంగా ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పల్లెల్లో స్థానిక ఎన్నికల సమరం రసవత్తరముగా జరుగనుంది. ఈసారి సర్పంచ్‌గా పోటీ చేస్తాం ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి అంటూ కొందరు ఆశావహులు సోషల్ మీడియాలో తెలుపుతున్నారు.